క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ముక్తియార్, తదితరులు

ప్రొద్దుటూరు: దస్తగిరి స్వామి గ్యార్మీ పండగ సందర్భంగా ఆదివారం అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్.ముక్తియార్ దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక మట్టి మసీదు వీధిలో దస్తుమియా అండ్ సన్స్ షేక్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముక్తియార్‌తోపాటు అఫ్జల్, రషీద్, సావిత్రి, యదార్థుడు, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్నా పట్టించుకోరా...!



అయ్యవారిపల్లె మడువంక వద్ద రోడ్డుపై జమ్ము

రాజుపాళెం: ఇటీవల కురిసిన వర్షాలకు ప్రొద్దుటూరు–ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో వెంగళాయపల్లె, అయ్యవారిపల్లె, తొండలదిన్నె–టంగుటూరు గ్రామాల మధ్య మడువంక ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. జమ్ము, మట్టి కొట్టుకువచ్చి రహదారిపై చేరింది. అయితే అధికారులు తొలగించకపోవడంతో వాహనదారులు వేగంగా వెళ్లి కిందపడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

కలసపాడు: కలసపాడు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు దారిలో ఉన్న గృహాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 10 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఓ ఇంటి స్లాబు పనుల నిమిత్తం ఆకస్మికంగా విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. ఇన్‌చార్జి ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. పోరుమామిళ్ల ఏడీఈని సంప్రదించగా విద్యుత్ సరఫరాలో జాప్యం జరిగిన విషయం తనకు తెలియదని, ఈ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గీతాశ్రమంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల సభా భవనంలో జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ రిజిస్ట్రార్ పద్మ మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమీ చైర్మన్ లక్ష్మయ్య, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ టీడీ.వరుణ్‌కుమార్‌రెడ్డి, అవార్డీ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రమణయ్య, విజయమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ హరినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరల్డ్ బైబిల్ డే సెలబ్రేషన్స్



ప్రసంగిస్తున్న బిషప్ శామ్యూల్ బాబు

కడప రూరల్ : నగరంలోని మాసాపేటలోని ఎలీము ప్రార్థనా మందిరంలో ఆదివారం వరల్డ్ బైబిల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ డాక్టర్ కె. శామ్యూల్ బాబు మాట్లాడుతూ ఆనాడు బైబిల్‌ను చేతి రాతతో రాసి అమ్మేవారని ఆ ముద్రణలను ధనికులు ఎక్కువ రుసుం చెల్లించి తీసుకునే వారని చెప్పారు. అయితే బైబిల్‌ను పేదలకు అందించే ప్రక్రియలో అంతర్ యుద్ధం ఏర్పడుతుందని భావించిన జోహానస్ జాన్ గూటెన్ బర్గ్ బైబిల్ రూపకల్పనకు టైపు యంత్రాల ద్వారా అక్షరాలకు రూపకల్పన చేసి నేడు యేసు క్రీస్తును నమ్మిన ప్రతి ఒక్కరి చేతిలో బైబిల్ ఉండడానికి గూటెన్ బర్గ్ కారణమయ్యారని చెప్పారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల్లో ముద్రించారని చెప్పారు. గూ టెన్ బర్గ్ జర్మనీ లోని మెయింజ్ పట్టణంలో 1400 సంవత్సరంలో జన్మించారని చెప్పారు. నేడు ఆయనను స్మరిస్తూ బైబిల్ ముద్రణ వేడుకలను ఘనంగా జరుపుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శామ్యూల్ బాబు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ దాసరి సుధాకర్, పాస్టరమ్మ దాసరి సువర్ణమ్మ, రెవ డాక్టర్ మల్లెం విజయ భాస్కర్, వరప్రసాద్, సంఘ పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు

వరద... చేసిన గాయం!



వరద ధాటికి వేర్లతో సహా బయటకు వచ్చిన మినుము పంట



వెంగళాయపల్లె శివాలయం వద్ద పొలాలకు వెళ్లే రహదారి దుస్థితి ఇదీ..



అయ్యవారిపల్లె వంక ఉధృతికి దెబ్బతిన్న పత్తి పంట

రాజుపాళెం మండలంలో గత నెలలో పెద్దముడియం, జమ్మలమడుగులో కురిసిన భారీ వర్షానికి రైతులు సాగు చేసిన వరి, జొన్న, పత్తి, పసుపు, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వెంగళాయపల్లె గ్రామ సమీపంలోని శివాలయం వద్ద పొలాలకు వెళ్లే రహదారి వర్షం నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. అలాగే అయ్యవారిపల్లె మడువంక వద్ద కట్టకు మట్టి కొట్టుకుపోవడంతో పత్తిపంట పూర్తిగా దెబ్బతింది. పర్లపాడు, అర్కటవేముల గ్రామాల్లో వర్షం నీరు కాలనీల్లో చేరి మేకలు, పశువులు మృత్యువాత పడ్డాయి. అలాగే పంటల్లో నీళ్లు నిలబడటంతో దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. – రాజుపాళెం

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డీసీ.గోవిందరెడ్డి, ఆదిత్యారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశినాయన: కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని వరికుంట్ల గ్రామంలో రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన 15 నెలలుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సోషల్ మీడియా వారిని కూడా వదలి పెట్టకుండా కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పనిచేస్తుందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, దాడులు జరిగితే వాటి ఫొటోలు, దాడికి సంబంధించిన ఘటనలను డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేసి లోకేషన్ షేర్ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అందరిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్షసాధింపు రాజకీయం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయని పేర్కొన్నారు. కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.రమణారెడ్డి, హనుమంతరెడ్డి, పంగా గురివిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దరామయ్య, వెంకటరామిరెడ్డి, పిచ్చిరెడ్డి, ఓబుళరెడ్డి, రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, శ్రీరాములరెడ్డి, గంటా రమణారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కుటుంబీకులు

కాశినాయన: మండలంలోని వరికుంట్లలోని జ్యోతి క్షేత్రానికి వెళ్లే దారిలో ఆర్చీ నిర్మాణానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఆదివారం భూమి పూజ చేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తన సొంత డబ్బుతో ఆర్చీని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి దంపతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

అట్లూరు: మండలంలోని వరికుంటమిట్ట కలవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బుర్రి గంగయ్య కుమారుడు గోపాలకృష్ణ వివాహ వేడుకలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి, కల్లూరు రమణారెడ్డి, ముడమాల ప్రభాకర్‌రెడ్డి, బోవిళ్ల చిన్న సూరారెడ్డి, పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, కువైట్ ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి, గన ఓబుళరెడ్డి, రమణయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేరు ఉచ్చరించలేని అసమర్థుడు ప్రవీణ్



మాట్లాడుతున్న భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేరును ఉచ్చరించలేని అసమర్థుడు టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ తన అనుచరులను కాపాడుకునేందుకు డీఎస్పీ, ఎస్పీల పనితీరును అభినందించారన్నారు. పోలీసులపై విమర్శలు చేయడం సరికాదని, పరోక్షంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని తప్పుబట్టిన ప్రవీణ్ ఎందుకు ఆయన పేరును ఉచ్చరించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఐదు మద్యం షాపుల్లో గాంధీ జయంతి రోజున విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరిపారని, ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో అరెస్టు అయిన వాటర్ ప్లాంట్ రాము కూడా ప్రవీణ్‌కు ప్రధాన అనుచరుడేనని తెలిపారు. స్వయంగా ప్రవీణ్ గోవాకు తీసుకెళ్లి గ్యాంబ్లింగ్ ఆడిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పేరు ఉచ్చరించడం చేతగాక, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని విమర్శించారన్నారు.ఈ సమావేశంలో గజ్జల కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌టీఏ నాయకులకు సత్కారం



నాయకులను సన్మానిస్తున్న భాషా పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్: భాషా పండితులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం హర్షణీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో పదోన్నతుల ఉత్తర్వుల కోసం కృషి చేసిన ఎస్ఎల్‌టీఏ నాయకులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అంకాల్ కొండయ్య, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలను ఆదివారం భాషా పండితులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 18వేల మంది భాషోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయుల పదోన్నతులకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఎంతగానో కృషి చేసిందన్నారు. ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ పదోన్నతులలో జరుగుతున్న అన్యాయంపై హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రోషన్, మణికంఠ భాస్కర్, లక్ష్మీనరసయ్య, నాగరత్నమ్మ, అనుపమ, సుజాత, రామకృష్ణ, రామసుబ్బారెడ్డి, రామిరెడ్డి, లక్ష్మీరాయల్, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో సందర్శకుల నిలువు దోపిడీ

విజయదశమి రోజున రూ.100.. ఇప్పుడు రూ.80

ప్రొద్దుటూరు: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో కాంట్రాక్టర్ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. బహిరంగ దోపిడీపై మున్సిపల్ అధికారులు కళ్లప్పగించి చూడటమేగానీ చేసిందేమీ లేదు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ టికెట్ ధర రూ.35, పిల్లలకు రూ.25 మాత్రమే ఉండాలని గెజిట్‌లో పేర్కొన్నా కాంట్రాక్టర్ ఈ నిబంధనను పట్టించుకోలేదు. దసరా రోజున ఎంట్రన్స్ టికెట్ రూ.100, ఆదివారం రూ.80 చొప్పున ముక్కుపిండి వసూలు చేశారు. ఎందుకు ఇలా వసూలు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నా తాము పనిచేసే కూలీలమని, ఏదైనా ఉంటే కాంట్రాక్టర్‌తో మాట్లాడుకోవాలని సిబ్బంది చెబుతుండటం గమనార్హం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ టికెట్ లేకుండా ఉచిత ప్రవేశం కల్పించారు. ప్రజలపై భారం వేయడం సరికాదని ఆయన నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ఏడాది, ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో ఎంట్రన్స్ టికెట్ వసూలుచేస్తున్నారు. ఎంట్రన్స్ టికెట్‌పై ధరను ముద్రించకుండా ప్రజల నుంచి అధిక మొత్తంలో దోచుకుంటున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్–2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్–5 రాష్ట్ర కౌన్సిల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సుధీర్‌బాబు కోరారు. ఆదివారం నగరంలోని ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్–5 రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్–2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు చాలా సంవత్సరాలుగా ఎలాంటి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని. విద్యుత్ యాజమాన్యం త్వరగా పరిష్కరించాలని హితవు పలికారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్– 2లు 6 ఏళ్లుగా పనిచేస్తున్న ప్రమోషన్లకు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ యాజమాన్యం ఒక సంస్థలో రెండు రకాల సర్వీసులు అమలు చేస్తోందని, ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. విద్యుత్ యాజమాన్యం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికైనా ఎనర్జీ అసిస్టెంట్ల ప్రధాన సమస్య అయిన నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి. 5 హేమకుమార్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు హరికృష్ణ, అశోక్, ప్రతాప్, కృపాకర్, వెంకటేష్ నాయక్, సంజీవ నాయక్, అనిల్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు

కడప అర్బన్: సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఆదివారం కడపలో పోలీసుల ఆధ్వర్యంలో ×సైకిల్ ఆన్ సండే× కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డి వీధి మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ సైకిల్ తొక్కి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా సైకిల్ వినియోగం ఎంతగానో దోహదపడు తుందన్నారు. సైక్లింగ్‌తో శారీరకంగా ఫిట్‌గా ఉండొచ్చని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, వ్యాయామం ఏ కుటుంబానికి మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్‌ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైల రెడ్డి, సీఐలు గంటా సుబ్బారావు, ఓబులేసు, జావీద్, ఎస్‌ఐలు మధుసూధన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లు, స్వామినాయక్, రామస్వామి రాజు, చూడామణి వర్మ, ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

వేతనాలు సరే.. మెటీరియల్ సంగతేంటి?

కడప సిటీ : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతన జీవులకు రావాల్సిన వేతనం మాత్రం అందింది. కానీ, మెటీరియల్‌కు సంబంధించిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు మే 31 నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్నాయి. దాదాపు 11 వారాలకు సంబంధించిన వేతనాలు అందాయి. మొత్తం రూ. 119 కోట్లు రావాల్సి ఉండగా, ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ. 1,600 కోట్లు కూలీల వేతనాలకు మంజూరు చేయగా, అందులో భాగంగా జిల్లాకు పెండింగ్ వేతనాలు అందాయి.

రూ. 40 కోట్లు పెండింగ్

అయితే మెటీరియల్ బిల్లులకు సంబంధించి రూ. 40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత పనులు చేసిన వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మెటీరియల్ కింద సిమెంటు, బీటీ, మెటల్ రోడ్లు వేశారు.

గత మార్చి నుంచి ఇప్పటివరకు అందుకు సంబంధించిన బిల్లులు కూలీల వేతనాలతోపాటు అందుతాయనుకున్న ఆశ వారికి నిరాశగా మారింది. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో చిక్కుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయంపై డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని వివరణ కోరగా.. మెటీరియల్ బిల్లులు త్వరలో అందే అవకాశం ఉందని తెలిపారు.

భావి పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

ప్రొద్దుటూరు: భావి సమాజ నిర్మాతలను నాలుగు గోడల మధ్య తయారు చేసే వారే గురువులని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శీను అన్నారు. స్థానిక రోటరీ క్లబ్, రోటరీ కంటి ఆస్పత్రి సభా భవనంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్, కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసి గౌరవించడం సత్సంప్రదాయంగా భావిస్తున్నామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, రోటరీ కంటి ఆస్పత్రి అధ్యక్షుడు కోటా శివకుమార్‌తో కలిసి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న తుమ్మల ఈశ్వర్‌రెడ్డి, దొంతు మురళీకృష్ణ, ఎల్.చంద్రఓబుళరెడ్డిలను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వాల చేత పొందే అవార్డుల కంటే అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ ద్వారా పురస్కారాలు స్వీకరించడం మరువలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ షేక్‌బాబా, దొంతు బాలాజీ, బేపారి జాకీర్ అహ్మద్, మల్లికార్జున, ఆయూబ్ ఖాన్, రాజారామ్మోహన్ రెడ్డి, ఖాదర్‌బాషా, తిరుపతయ్య, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణం గురువులతోనే సాధ్యం



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్: ఉత్తమ సమాజ నిర్మాణానికి గురువులే మార్గదర్శకులు అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దొరసానిపల్లె గోపీకృష్ణ హైస్కూల్‌లో ప్రైవేటు పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం సత్కరించారు. కడప జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం(కృష్మ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిని ఉన్నతులుగా తీర్చిదిద్దేది గురువేనని వివరించారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు సమాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, మంచిచెడులు, పోటీతత్వం, సంప్రదాయాలు నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం 150 మంది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, సోమశేఖర్‌రెడ్డి, పల్లేటి ప్రభాకరరెడ్డి, రమణారెడ్డి, బాలసుబ్బారెడ్డి, ఆంజనేయులు, రాజారావు, గోపీకృష్ణ, ప్రదీప్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశానికి రక్షణ కవచంగా ఆర్ఎస్ఎస్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పోరుమామిళ్ల: వంద సంవత్సరాలుగా పని చేస్తూ ఆర్ఎస్ఎస్ దేశానికి రక్షణ కవచంగా నిలిచిందని రేంజర్ రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా పోరుమామిళ్లలో ఆదివారం శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ, జెండాలు పట్టుకొని పట్టణ ప్రధాన రహదారిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో జరిగిన సభలో ముందుగా భరతమాత, కేశవరావు బలిరామ్ హెడ్గేవార్, గురూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథి రేంజర్ రఘునాథరెడ్డి, రామకృష్ణ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నిబద్ధత కలిగి, ఆడంబరాలకు వెళ్లకుండా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారన్నారు. ఆపత్కాలంలో దేశాన్ని ఆదుకోవడంలో ముందుంటారని, 1948, 1962, 1965 చైనా పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత సైనికులకు అనేక సేవలందించారన్నారు. దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన వారు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలన్నారు. గ్రామపెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జునరెడ్డి, మార్కారెడ్డి, తదితరులు

పోరుమామిళ్ల: మండలంలోని రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్ మరాటా వీధిలో ఆదివారంఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి పాల్గొని హోమం, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా హోమం, కుంభాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

నిప్పంటించిన దుండగులను శిక్షించాలని నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బద్వేలు అర్బన్: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవలంపేట సెంటర్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు నాగదాసరి ఇమ్మానుయేల్, ఇరుపోతు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీనియర్ దళిత నాయకులు కూకట్లపల్లి మురళి ఆధ్వర్యంలో వారు ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.గురుమూర్తి, శిఖామణి, హసన్, పి.వెంకటరమణ, నారాయణ, పుల్లయ్య, సుబ్బరాయుడు, మోహన్‌క్రిష్ణ, వెంకటయ్య, పాల్గొన్నారు.

7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా

ప్రొద్దుటూరు కల్చరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ, కరవు భత్యం, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సురేష్, వరప్రసాద్‌రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.